


# మూసీ

# MUSI


• Samputi : 21 • Sanchika : 4 • Pages : 60 • Rs. : 20

• February 2019




వ్యవస్థాపకులు

శ్రీ బి.ఎన్.శాస్త్రి

సంపుటి : 21 సంచిక : 4

ఫిబ్రవరి - 2019

'విలంబ' మాఘ మాసం

సంపాదకులు

డా॥ సాగి కమలాకర శర్మ

Printed and Published by

**B. Anantha Laxmi**

*Type Setting at :*

Kavyasree Graphics

Ph: 9347971177

Printed at : Sri Sai Process

Ph. 27563075

విడిప్రతి.20/-

సంవత్సర చందా.200/-

శాశ్వత సభ్యత్వం.2500/-

(పది సంవత్సరాలకు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక

2-2-1109/బికె- ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట

హైదరాబాద్ - 500 013.

ఫోన్: 9347971177

email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER

ISSN 2457-0796




# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ... వ్యాసాలు


మూసీ సాహిత్య ధార ... 6
నాటకరంగానికి మొదలు, తుది నాగభూషణశర్మ... ఆచార్య వెలుదండ నిత్యానందరావు 7
భారతీయ సంగీతం - 31 ... సామల రాజవర్ధన్ 10
విశ్వనాథ సాహిత్య దర్శనం - 14 .... డా॥ జె. భారతి 15
తెలంగాణ కథ - గల్ఫ్ వలస ... డా. త్రివేణి 19
అమృతాన్ని తలపించే అమ్మభాష - 'తెలుగుభాష' ... అలూరిహరినాథశర్మ 23
మరుగున పడిన మాణిక్యాలు - బాబారావు ... చాట్ల నర్సయ్య 25
నల్లదీగ శ్రీనివాసాచార్యులు కట్టబ్రహ్మన చరిత్ర కావ్య నేపథ్యం ... బి. శోభన్‌బాబు 27
తెలుగు సాహిత్యంలో విలాస కావ్య వికాసం ... లక్ష్మయ్య 31
తెలుగులో ప్రహసనాలు ... ఐ. చిదానంద 34
విజ్ఞాన భాండాగారం జానపద గిరిజన విజ్ఞాన ప్రదర్శన శాల - పాద్య సుమన్ 36
పద్య కవిత్వం - పరిశోధన ... డా. గంధ్ర లక్ష్మణరావు 41
తెలంగాణా కథా సాహిత్యం - భాషా పరిశీలన... భారతి 45
మహాకవి జాషువా విరచిత గబ్బిలం ... ఎ. మారుతి 47
కథా సరిత్సాగరం (తెలుగు కథలు) ... కళా మాధవి 49
మహాభారతంలో మంచి కథలు ... కౌండిన్య తిలక్ (కుంతి) 51
గట్టెపల్లి కథామాధురి... ఏనుగు నరసింహారెడ్డి 54
మూసీ పదవినోదం... డా. తాడేపల్లి పతంజలి 61


## కవితలు


మా ఫలేషు కదాచన... కీ.శే. జోస్యము విద్యాసాగర్ 5
తెలంగాణ గుళ్ళు - దేవుళ్ళు... డా. ఎన్.ఆర్. వెంకటేశం 6
అమ్మా! నాకీ జన్మనీ... డా. గన్నోజు శ్రీనివాసాచారి 18
దొంగ దొంగ ... జమాల్‌పుర్‌కర్ గంగాధర్ 26
కింకర్తవ్యం ... రసస్రవంతి - కావ్యసుధ 33
ఏది బతుకమ్మ... కె. నవీన్‌కుమార్ 40
కాపరి... అట్టెం దత్తయ్య 44
ముండకోపనిషత్తు (ముత్యాలసరాలలో) ... జక్కని వెంకటరాజం 52
కోయిల ... డా. వద్దూరి ఆంజనేయరాజు 56


## సమీక్షలు


చిరకాలం నిలిచేకృతి శేషేంద్ర ఋతుఘోష.... డా. తిరునగరి 57
చైతన్య దివిటీలు మలహరి రచనలు ... అట్టెం దత్తయ్య 69
స్వీకృతి ... 62


ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.


*Printed, Published and Owned by* : B. Anantha Laxmi, 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.

*Office* : 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.

*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.

*Editor* : Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80

# తెలుగు సాహిత్యంలో విలాస కావ్య వికాసం

లక్ష్మయ్య, సహాయ ఆచార్యులు, మహబూబ్‌నగర్ ఫోన్ : 9133635714

విలాస శబ్దానికి శ్లేషణ క్రీడనలు (ఆలింగన రతి రహస్యాలు)అనే అర్థమే కాక లీలా మహాత్మ్యం అనే అర్థం కూడా ఉంది. విలాసం అనగా శృంగార చేష్టా విశేషం. ఇష్టులైన వ్యక్తుల దర్శనం చేతనే స్త్రీలలో కలిగెడు శృంగారచేష్టా విశేషం. విలాసం అంటే చిరునామా అనే అర్థం కూడ స్ఫురిస్తుంది. దక్షిణాంధ్ర యుగంలో విలాసశబ్దం 'భవనం' అనే విశేష అర్థంలో కూడా ప్రయోగించబడింది. నన్నయకాలంలో లీలలను సూచించేదిగానూ, నన్నెచోడుని కాలంలో అభినయ కళ సూచికంగానూ, శ్రీనాథుని కాలంలో శృంగారరస సంబంధిగానూ, నాచన సోమనకాలంలోకూడ శృంగార చేష్టాల సంబంధిగానూ విలాస శబ్దం వాడబడినది.

"తెలుగులో వెలసిన విలాస కావ్యాలలో దివ్యనాయకుల మహిమలు, దివ్యాదివ్యుల లీలలు, భక్తిశేఖరుల భక్తిచర్యలు, ధీరోదాత్తుల వీరగాథలు, ధీరలలితుల శృంగారకథలు వర్ణించబడుతూ ఉండటం గోచరిస్తుంది." అని జి.వి. సుబ్రహ్మణ్యం వివేచించారు.

నన్నయ-చాముండికా విలాసం, నన్నెచోడుడి - కళావిలాసం వాచనసోమన-వసంత విలాసం, హరి (హర) విలాసం రాసినట్లు ఉన్న అవి అలబ్ధాలు. తెలుగులో విలాసకావ్యాలు శతాధికంగా వెలువడినవి. వీనిలో శృంగార, వీరాద్భుత, భక్తిశాంత రస కావ్యాలున్నాయి. వీటన్నింటిలో శృంగార రసకావ్యాలే అధికం. ప్రక్రియ పరంగా చూస్తే కావ్యాలు, ప్రబంధాలు, యక్షగానాలు, నాటకాలు, క్షేత్ర మహాత్మ్యాలు, చారిత్రకాలు, శాస్త్రగ్రంథాలు, శతకాలుగా వెలువడినవి. కావ్య ప్రక్రియలో శ్రీనాథుని హరవిలాసం కలికి తురాయి. "శ్రీనాథుడు విలాస శబ్దం ఎన్ని అర్థాలలో ప్రయోగించడానికి వీలుందో, ఎన్ని రసాలను వ్యంజింప చేయటానికి వీలుందో వాటన్నింటిని సంవదించి హరవిలాస కావ్యసంపుటిని నిర్మించాడు." అని జి.వి. సుబ్రహ్మణ్యం విశ్లేషించాడు. హరవిలాసంలో చిరుతొండ నంబి కథ, గౌరి కళ్యాణకథ, దారుకావన విహారం, సముద్ర మథనకథ, కిరాతార్జునీయ కథలతో శ్రీనాథుడు విలాసకావ్యంలో కథాకావ్య ప్రక్రియకు నాంది పలికారు. అతడు ఒక్కొక్క కథలో ఒక్కో రసాన్ని పరిపోషించాడు. తర్వాత తెలుగు సాహిత్యంలో ఒక్కో రసానికి ఒక్కొక్క విలాసకావ్యం వెలువడేంత ప్రభావం చూపింది శ్రీనాథుని **హరవిలాసం.** ఆ స్ఫూర్తితోనే నిశ్శంక కొమ్మన **శివలీలావిలాస** కావ్యాన్ని వెలువరించాడు. దీనిలో 36 శివలీలలను కాలక్రమంలో అమర్చి కావ్యనిర్మాణం చేశాడు. విలాస కావ్యాలలో ఇదొక విశిష్ట ప్రయోగం.

తాళ్ళపాక చిన్నన్న ద్విపదలో రాసిన **పరమయోగి విలాసం** విష్ణు భక్తాగ్రేసరుడైన విప్రనారాయణుడు వేశ్యాలోలుడై దేవదేవితో సుఖించడం ఇందలి ఇతివృత్తం. భక్తి చర్యలతోపాటు శృంగారలీలలు వర్ణితం. కూచిమంచి తిమ్మకవి రాసిన **రాజశేఖర విలాసం** భల్లాణుడి శివభక్తిగాథత, తన సొంత భార్యనే వేశ్యారూపంలో జంగమరూప ధారి అయిన శివుని చెంతకు పంపే కథ ఇందు వర్ణితం. శృంగార చేష్టాదులు వర్ణించే గ్రంథం. గద్వాల సంస్థానపాలకుడు సోమ భూపాలుని ఆశ్రితుడు కాణాదం పెద్దన సోమయాజి రాసిన **భద్రాపరిణయం** అనే నామాంతరం గల **ముకుంద విలాసం.** శ్రీకృష్ణుడు భద్ర అనే కన్యను చేపట్టిన తీరు ఇందలి ఇతివృత్తం. చిత్రకవితా రీతులకు పెట్టింది పేరు. ఇతనికి సూరపురం సంస్థానంవారు 'అభినవ అల్లసాని' అనే కైవారం ప్రధానం చేశారు. కాళ్ళకూరి గౌరీ కాంతకవి రాసిన ధర్మనందనవిలాసం ధర్మరాజు, విదేహరాజపుత్రిక **కళావతి పరిణయం** ఇందలి ఇతివృత్తం. అజ్జరపు పేరయలింగం, బమ్మెర కేసన కవి మల్లయ వులకు బావమరిది. ఇతడు రాసిన ఒడయనంబి విలాసం-ఒడయనంబికి సుందరనాయ నారు అనే నామాంతరం కలదు. ఇతడు పరమనాచి అనే సాని కూతురును వలచిన ఇతివృత్తం వర్ణితం. ప్రేయసి చన్నునే శివలింగంగా భావించిన విటనాయనారు. దీనిలో భక్తి, రక్తి, ముక్తి శృంగారాలు, విశేషంగా వర్ణించబడినవి. చింతలపల్లి వీరరాఘవయ్య రాసిన మధురవాణీ విలాసం-కార్త్య వీరార్జునుడు, పాంచాల రాకుమార్తె మధురవాణి వివాహం ఇందలి ఇతివృత్తం. ఇరువురి శృంగారలీలలు వర్ణితం. చిత్రకవి వేంకట రమణ కవి రాసిన **సాంబవిలాసం.** శ్రీకృష్ణుడి కుమారుడైన సాంబుడు, దుర్యోధనుడి కుమార్తె లక్షణ వివాహ కథ ప్రధానం. అష్టావధాన కవి అనే బిరుదునామంతోనే ప్రసిద్ధుడు, ఇతడు రాసిన **చంద్రశేఖర విలాసం** వినూత్న ఇతివృత్తం కలది. పారిజాత వృత్తాంతాన్ని శివపరంగా చెప్పిన రచన. నారదుడు తెచ్చిన పారిజాతసుమం కారణంగా గంగా గౌరిలకు కలహం ఏర్పడటం. చంద్రశేఖరుడు వారిని ప్రసన్నం చేసుకోవడమే ప్రధాన ఇతివృత్తం. వీరి శృంగార లీలలు వర్ణితం.

కావ్యరూపంలో వెలిసిన కొన్ని విలాస కావ్యాల వివరాలు,

ఇవేకాక అనేక ఇతివృత్తాలతో అర్ధశతకం కావ్యాలు తెలుగులో వెలువడినవి. మచ్చునకు కొన్ని మాత్రమే ప్రస్తావించబడినవి.

విలాస ప్రబంధాలలో **విజయవిలాసం** జయపతాక్క. తంజవూరు పాలకుడు, రఘునాథ నాయకుని ఆశ్రితుడు చేమకూర వేంకటకవి రాసిన మూడు ఆశ్వాసాల ప్రబంధం విజయవిలాసం. తీర్థయాత్రకు బయలు దేరిన అర్జునుడు ముగ్గురు నాయికలు ఉలూచి, సుభద్ర, చిత్రాంగదలతో సాగిన వివాహఘట్టాలు వర్ణితం. మహాభారతకథ ఆధారంగా, కథకు చక్కని మార్పులుచేసి, ప్రత్యక్షర చమత్కారంగా శృంగార రస ప్రబంధాన్ని తీర్చిదిద్దాడు. రసపుష్టి, జాతివార్త చమత్కారాలు, తెలుగువారి ఆచారవ్యవహారాలు, సంప్రదాయాలు విస్తరించి వర్ణించిన ప్రబంధం.

విజయ రాఘవ నాయకుని ఆస్థానకవి చెంగల్వకాళయ రాసిన **రాజగోపాల విలాసం** - తంజావూరు జిల్లాలోని చంపకవనంలోని మన్నారుక్షేత్రం దక్షిణ ద్వారకగా ప్రసిద్ధి. ఆ క్షేత్రస్వామి రాజగోపాలుడు. ఇతడే మన్నారు దేవుడుగా సేవలందుకొంటాడు. రాజగోపాలస్వామి అష్టభార్యలను, అష్టవిధ శృంగారనాయికలతో పోల్చి నిర్మించిన రమణీయకృతి. శృంగారరసం జాలువారిన రచన రాజగోపాల విలాసం.

గోళ్ళ చిన రామప్ప ఆశ్రితుడు పచ్చకప్పురపు అనే పౌరుష నామం గల తిరువేంగళకవి రాసిన **చొక్కనాథ విలాసం** అనే నామాంతరం గల చొక్కలీలా విలాసం తొమ్మిది ఆశ్వాసాల ద్విపదకావ్యం. సంస్కృత స్కాందపురాణంలోని హాలాస్యక్షేత్ర మహాత్మ్యం తెలిపే తొలి రచన. ఈ క్షేత్రంలో వెలసిన దేవుడికి హాలాస్యుడని, చొక్కనాథుడని, సుందరేశుడనే నామాంతరాలున్నవి. సుందరేశుడు యుగానికి పదహారు చొప్పున నాలుగు యుగాలలో కావించిన 64 లీలలు ఇందులో కాలానుగుణంగా వర్ణితం. దైవలీల మహాత్మ్యంలో మొదట ఎన్నితగిన విలాసప్రబంధం.

మైసూరు పాలకుడు చిక్కదేవరాయల పుత్రుడు. మూకరసు నామాంతరంగల కంఠీరవ నరసరాజు (కంఠీరవరాజు) రాసిన **అష్టదిక్పాలక విలాసం.** అష్టదిక్పాలక సమేతుడై ఇంద్రుడు నాటకశాలను పరీక్షించడానికి రావడంతో ఆయా దిక్పాలక ప్రతీకలైన నాట్యగత్తెలు పావకి, వైవసత్వ నైరుతి, వారుణి, దాయవి, కౌబేరి మున్నగువారు పంతంపట్టి నాట్యం చేయడం ఇందలి ఇతివృత్తం. వారి నాట్యకౌశల తారతమ్యం నిర్ణయించడానికి ఇంద్రుడు కంఠీరవరాజును నిర్ణేతగా నిలుపడం ఇందు వర్ణితం. నాట్య విశేషాలలోని శృంగార చేష్టలను సూక్ష్మంగా వర్ణించిన విలాస ప్రబంధం.

కుతుబ్‌షాహీల ఆశ్రితుడు, ఉద్యోగి, గోల్కొండ నగర కరుణం సారంగు తమ్మయ్య రాసిన నాలుగు ఆశ్వాసాల శృంగార ప్రబంధం **వైజయంతీ విలాసం.** పరమ వైష్ణవభక్త శిఖామణి విప్రనారాయణుడు వేశ్యాదేవదేవి మధ్య సాగిన శృంగార చేష్టలు, రతిసౌఖ్యాలు, ప్రబంధోచితంగా తీర్చిదిద్దిన రచన.

దోమకొండ సంస్థాన ఏలిక, రాజన్నదేశాయి ఆశ్రితుడు రాపాక లక్ష్మీపతి రాసిన ఐదు ఆశ్వాసాల ప్రబంధం **శ్రీకృష్ణవిలాసం.** శ్రీకృష్ణుడు అష్ట నాయికలైన రుక్మిణి, జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్షణలను చేపట్టిన తీరు ప్రబంధోచితంగా తీర్చాడు. మధురభక్తి ప్రతీకలైన షోడష సహస్ర రాజకన్యల పరిగ్రహణం, నరకాసురవధ, పారిజాతాపహరణ వీరాద్భుత రస ఘట్టాలను కూర్చిన ప్రబంధం శ్రీకృష్ణ విలాసం. విలాసప్రబంధాలలో శృంగార రస ప్రధానంగా సాగి విలాస శబ్దానికే సార్థకత చేకూర్చిన రచన ఇది.

కానుకొలను వెంకటదాసు రాసిన **రాసక్రీడవిలాసం.** ఇది శ్రీకృష్ణ నాటక ప్రబంధంలోని నాల్గవ ఆశ్వాసం మాత్రమే. కాని ఇదొక్కటే లభ్యమైనది గ్రంథంలోని మిగిలిన భాగం అలబ్ధం. శ్రీకృష్ణుడి బృందావన లీలలు, శృంగార చేష్టాధికంగా వర్ణితమైన రచన.

తెలుగులో వెలసిన విలాస ప్రబంధాలు శృంగారరస ప్రధానంగా, వీర అద్భుత రసాలు గౌణంగా తీర్చిన రచనలుగా వచ్చాయి. సాహిత్యంలో ప్రాధాన్యత ఉన్న కొన్ని రచనలను మాత్రమే ఇక్కడ చర్చించాను.

ఎహలంక పాలకుడు, బెంగళూరు నగర నిర్మాత, ప్రదర్శన యోగ్యమైన యక్షగాన రాజకవి, పెదకెంపరాయుడు రాసిన **గంగాగౌరీ విలాసం** ఇది మొత్తంగా లభించలేదు. సోమేశ్వరుని లీలలు, అతడు గంగా గౌరీలను పరిగ్రహించిన తీరు వర్ణించిన యక్షగానం. ఆది, అంత్య ప్రాసలు నిలిపి పదాలు చెప్పడంలో చేయితిరిగిన కవి ఇతడు.

తంజావూరు పాలకుడు, తెలుగును రాజభాషగా ఆదరించిన మరాఠ రాజకవి శహజీ రాసిన **కిరాత విలాసం** - శృంగారపూరిత యక్షగానం. శివపార్వతులు పందెం వేసుకోవడం చెంచుల వేషంలో వ్రతం ఆచరించడం వారి ప్రణయం, ప్రకృతి సోయగం ఇందు వర్ణితం. మరొక రచన **కృష్ణలీలావిలాసం** - శ్రీకృష్ణ జననం, బాల్యక్రీడలు, సత్యభామ వివాదం, గొల్లభామల రక్షణకై జోగిని రక్షకట్టడం, జోగిని నాల్గుభాషలలో పాత్రోచితంగా మాట్లాడేతీరు, మంత్రసాని ప్రసంగం గొల్లెతల అసభ్యపదజాలం మున్నగునవి శృంగార చేష్టలను పరాకాష్టగా నిలిపిన విలాస యక్షగానం.

బుడతకీచులవారి ఉద్యోగిగా ప్రళయకావేరి (పులికాటు) పట్టణ అమీన్‌గా పనిచేసిన కంకంటి పాపరాజు రాసిన **విష్ణుమాయవిలాసం**. ఇందు జగన్మోహినీ విలాసాన్ని వర్ణించాడు.

తంజావూరు పాలకుడు, నాయకరాజు, రాజగోపాలస్వామి భక్తుడు మన్నారు దాసుడనే నామాంతరంగల విజయరాఘవనాయకుడు. అతని భోగపత్ని పసుపులేటి రంగాజమ్మ రాసిన ఐదు ఆశ్వాసాల ప్రబంధం, **మన్నారు దాస విలాసం**. నాయకరాజుల వంశవర్ణన, విజయరాఘవుని వైభవ విశేషాలు, పాల్గుణోత్సవ వైభవం సమకాలీన సంఘజీవితం విపులంగా నమోదు చేసిన చారిత్రక విశేషాల తెలిపే రచన. మన్నారు దాసుడి శృంగార జీవితం ఇందు వర్ణితం.

మధుర పాలకుడు, విజయసింహభూపతి ఆశ్రితురాలు సౌందరి రాసిన **అల్లాడ విజయసింహభూప విలాసం** – యధామాతృక అనువాదంగా (మన్నారు దాస విలాసం) కొనసాగింది. మదనోత్సవ విశేషాలు, సమకాలీన సంఘజీవనం, శృంగార లీలలు వర్ణింపబడినవి.

తంజావూరు పాలకుడు, సరస్వతి మహల్‌ను గ్రంథాలతో నింపిన పొత్తపు ప్రేమికుడైన శహాజి ఆశ్రితుడు నివర్తి శేషాచలపతి రాసిన **శహజీ విలాసం**. శహాజిని వలచిన ఒక కన్య విరహం, దౌత్యం, ప్రియుడి అనునయం ఇందు వర్ణితం, దానశీలత, భాషాభిమానం, వంశావర్ణన, చారిత్రక విశేషాలున్నవి.

విజయనగర సంస్థానాధీశుడు విజయరామగజపతి ఆశ్రితుడు పోడూరి వేంకట రాజకవి రాసిన రామలీలా విలాసం – గజపతి పట్టాభిషేకోత్సవాన్ని, శ్రీరాముని పట్టాభిషేకోత్సవంతో అభేదం తెలుపుతూ వర్ణించిన రచన.

వాత్స్య శ్రీరంగాచార్యులు రాసిన **శాల్మలీ కందనందన విలాసం** పద్యకావ్యం. హైదరాబాద్ సమీపంలోని బూరుగుగడ్డ క్షేత్ర మహాత్మ్యం తెలిపే రచన. కందనందనుడి లీలలు వర్ణితం. శేషం రంగాచార్యులు రాసిన **భావనారాయణ విలాసం** యక్షగానం పొన్నూరు క్షేత్ర మహాత్మ్య సంబంధ కథ. భావనారాయణస్వామి ప్రత్యక్షమై గోవిందునకు సాక్ష్యం చెప్పడం ఇందలి ప్రధాన ఇతివృత్తం. కడు రమ్యంగా వర్ణితమైనది. నాయకరాజుల కాలంవాడు గణపవరపు వేంకటకవి రాసిన ఏకాశ్వాస ప్రబంధం. **ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయ విలాసం**. దీనిలో వేంకటేశ్వరునికి నాంచారమ్మకు మధ్య సాగిన ప్రణయం వర్ణితం. చిత్రబంధ కవిత్వాలకు లక్షణ గ్రంథంగా నిలిచింది.

తెలుగు సాహిత్యంలో విలాస కావ్యాలు తమ ప్రత్యేకతను నిలుపుకొని, సాహిత్యవికాసానికి తమ వంతు దోహదం చేశాయనడం సత్యదూరం కాదు. అందులో రాపాక లక్ష్మీపతి రాసిన శ్రీకృష్ణ విలాసం కూడ విలాస కావ్యాల ప్రత్యేకతను నిలుపుకొని, తెలుగు సాహిత్యంలో స్థానం పొందిందని చెప్పవచ్చు.

# కిం కర్తవ్యం

శివునాజ్ఞ లేనిది చీమైనా కుట్టదట
అన్నమని అడగనిది అమ్మైనా పెట్టదట
జరిగేదంతా మంచికట
సునామీయైనా ముంచదట
జరిగేది జరిపించేది
జగన్నాటక సూత్రధారియట
జీవితంలో కారమైనా
వికారమైనా మమకారమైనా
సాకార నిరాకారుని కరుణేనట
వీడిపోని బంధాలు
వెంటాడే సమస్యలు
ఊపిరున్నంతవరకు
ఉయ్యాలలూపుతున్నా
ముందు నుయ్యి వెనుక గొయ్యి
పాతాళానికి పడిపోలేక
ఆకాశానికెగిసిపోలేక
పంజరంలోని పక్షిలా
బ్రతుకునీడుస్తున్నా
బాధలతో యేడుస్తున్నా
వీక్షిస్తున్న దేవుడ
రక్షింపరావడం లేదేమి?
అన్యాయాల్ని అధర్మాన్ని
అడ్డుకోలేక పోతున్నాడేమి?
నిలువుదోపిడికి మరిగినవాన్ని
నిత్యం దోపిడికి మరిగినవాన్ని
నిత్యం దోచే వాళ్ళున్నారని
లంచాలకు లాంఛనాలకు
తలవంచే కిరీటధారిని
దేవుడందామా? ఊరుకుందామా?
ఏదైతే అదే లెమ్మని
సరిపెట్టుకుందామా

'రస స్రవంతి - కావ్యసుధ'
ఫోన్ : 9290215858 - 9247313488